
హైదరాబాద్ వార్త



# అనుమానం పెనుభూతమై..

### సోషల్‌మీడియాలో కట్టుకున్నదానిపైనే అసభ్య పోస్టులు

### శాడిస్ట్ భర్త వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్యాయత్నం


**బేగంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త :** భర్త అత్త మామల వరకట్నం వేధింపులతో పాటు ఇన్‌స్టా గ్రామ్‌లో అసభ్య పదజాలంతో దూషించడంతో భర్త వేధింపులు తాళలేక ఫినాయిల్ తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని గైదిన్ బాగ్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాంగోపాల్‌పేట గైదిన్ బాగ్‌కు చెందిన యువతిని రామంతాపూర్‌కు చెందిన భీమ్‌రాజ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని, మూడు నెలల క్రితం ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్న ఇద్దరు కొన్నేళ్ల పాటు సంతోషంగానే గడిపారు. నెల రోజులుగా వీరిమధ్య గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలియజేసారు. భర్తతో పాటు అత్తమామలు కూడా అదనపు కట్నం తీసుకురావాలంటూ యువతిని మానసికంగా హింసించడంతోపాటు శారీరకంగా కూడా హింసించినట్లు బాధితురాలు పోలీసులకు వివరించిందన్నారు. మద్యానికి బానిసైన భీమ్‌రాజ్ ఎలాంటి పనిచేయకుండా సోమరిపోతుగా తిరుగుతూ భార్యను వేధించేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. అతని వేధింపులు తాళలేక ఇటీవల పుట్టింటికి వెళ్లిన యువతిపై ఆమె భర్త ఇన్‌స్టా గ్రాంలో అసభ్య పదజాలంతో కూడిన పోస్టులు చేసినట్లు మిగతా 3లో



వరదనీటితో మునిగిన రహదారులు



ఎర్రగడ్డ వద్ద కారుపై కూలిన భారీ వృక్షం



# నగరం ఆగమాగం

### మళ్లీ కుండపోత వర్షం

### నదులను తలపించిన ప్రధాన రోడ్లు

### ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం..

### అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మరోసారి నగరంలో వర్ష బీభత్సం వణికించేసింది. కుండపోత వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. గురువారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో నగరంలో రహదారులను జలమయం చేసింది. ట్రాఫిక్ నిలిచిపోయి, తక్కువ ఎత్తులోని ప్రాంతాలు నీటమునిగాయి. సాయంత్రం ఆఫీస్ సమయాల్లో వర్షం కురవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనదారులు, పాదచారులు వర్షం నుండి తప్పించుకోవడానికి ఫ్లైఓవర్లు, దుకాణాల షెడ్ల కింద తలదాచుకోవాల్సి వచ్చింది. ప్రధాన రోడ్లన్నీ నదులను తలపించాయి. బోడుప్పల్, రామంతాపూర్, నాచారం, తార్నాక, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, రసూల్‌పురా, మధురానగర్, బోరబండ, యూసుఫ్‌గూడలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, మెహదీపట్నం, లంగర్‌హౌస్, కార్వాన్, గోల్కొండ, ఖైరతాబాద్, లక్డీకపూల్, మాదాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, వివేకానందనగర్, హిమాయత్‌నగర్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, కాప్రా, నేరేడ్‌మెట్, మల్కాజ్‌గిరి, అల్వాల్, జియాగూడ, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఫిలింనగర్, ఎల్‌బీనగర్, వనస్థలీపురం, నాగోల్, మల్కాజ్‌గిరి, జవహర్‌నగర్, కాప్రాలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి వాహనదారులు మిగతా 3లో

# డీల్ ఏదైనా రెడీ



### నగరంలో దడపుట్టిస్తున్న రౌడీషీటర్లు

### అక్రమార్కుల పంచాయితీల్లో కీలకపాత్ర

### భూ కబ్జాల నుంచి కుటుంబ సమస్యల వరకూ..

### విషయం ఏదైనా ఇట్టే సెటిల్‌మెంట్

### లొంగకపోతే చితక్కొట్టుడే

### పనిని బట్టి మనీ డిమాండ్

### పొలిటికల్, పోలీస్ అండతో రెచ్చిపోతున్న రౌడీ బాస్‌లు

### దుండగుల అకృత్యాలపై కుమిలిపోతున్న బాధితులు

శాంతి భద్రతలపై ఉక్కుపాదం మోపుతున్నామని పాలకులు చెబుతున్న కబుర్లు ఉత్తుత్తివే అనిపిస్తున్నాయి. స్మార్ట్ సిటీలలో ఒకటిగా విస్తరించిన భాగ్యనగరంలో అరాచకాలు రానురాను పెరిగిపోతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా దాదాగిరి చేస్తున్న అక్రమార్కులకు నగరం అడ్డాగా మారుతోంది. 'ప్రాపర్టీ' ఏదైనా సరే.. కన్నుపడిందంటే కైవశం' కావాల్సిందే. వాళ్ల చేతికి మట్టి అంటకుండా పనులు చక్కబెట్టటానికి రౌడీ షీటర్లతో డీల్ మాట్లాడుకుంటున్నారు. రౌడీలకు ముకుతాడు వేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించటంలేదు.

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సిటీలో రౌడీషీటర్ల హవా కొనసాగుతోంది. భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు ఏవైనా సరే పరిష్కారం చూపుతామంటూ తమను ఆశ్రయించిన వారికి భరోసా కల్పిస్తున్నారు. నయానో, భయనో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసుల అండతో తాజా, మాజీ రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. రౌడీషీటర్ల ఆకృత్యాలపై పోలీసులకు ఫిర్యాదు చేసే ధైర్యం లేక బాధితులు లోలోపల కుమిలిపోతూ నరకయాతన అనుభిస్తున్నారు. మరికొందరు తమ ప్రాణాలను అర్థంతరంగా ముగిస్తున్నారు. హిమయత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి తన వ్యాపార నిమిత్తం తెలిసిన వారి వద్ద భూమికి సంబంధించిన పత్రాలను తనాఖా పెట్టి రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారంలో ఒడిదొడుకుల కారణంగా కొద్దిగా ఆలస్యంగా వాయిదాల పద్ధతిలో అసలు, వడ్డీ కలిపి రూ. 80 లక్షల వరకు ముట్టజెప్పారు. కానీ, అప్పు ఇచ్చిన వ్యక్తి అంతటితో వదల లేదు. తీసుకున్న అప్పు ఇంకా చెల్లించాల్సి ఉందని సదరు వ్యాపారిని ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించాడు. తనఖా భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని పరిచయస్తుల ద్వారా ఓ మాజీ రౌడీషీటర్‌ను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన రౌడీషీటర్ ఆ వ్యాపారిని భయబ్రాంతులకు గురిచేసి సదరు భూమిని ఆ వ్యక్తికి సేల్‌డీడ్ చేయించాడు.

తార్నాక ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ సిటిజన్ తన స్థలాన్ని డెవలప్‌మెంట్ కోసం ఓ బిల్డర్‌కి అప్పగించాడు. అపార్ట్‌మెంట్ నిర్మాణం చేసి, విక్రయించిన తర్వాత డబ్బులతో పాటు అందులోని 10 ఫ్లాట్లను స్థల మిగతా 3లో



సిసిటివి పుటేజిని పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

# ఈవిఎం గోదాం తనిఖీ

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ గురువారం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చుడి బజార్‌లో ఉన్న ప్రధాన ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. ఈసందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి గోదాం లోపల ఉన్న వస్తువుల నిల్వ ఉన్న భద్రతా, స్థితిగతులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నిఘా నేత్రాల పనితీరు, గోదాం భద్రతను కూడా జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నిక సంఘం మార్గదర్శకాల మేరకు గోదాం వద్ద భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

గుడిమల్కాపూర్ పూల మార్కెట్ గురువారం కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నోములు, వ్రతాలు పెద్ద ఎత్తున జరగనున్న నేపథ్యంలో మార్కెట్‌కు వినియోగదారులు పోటెత్తారు. డిమాండ్ విపరీతంగా ఉండటంతో వ్యాపారులు పూల ధరలను కొండెక్కించేశారు. సాధారణ రోజుల్లో కిలో 100 నుంచి 150 రూపాయల చొప్పున ధర పలుకుతుండగా నేడు 250 నుంచి 800 వరకూ పెంచేశారు. రూ.10 ఉండే కలువ పువ్వు ధరను రూ.50కి పెంచేశారు. ఇలా అన్ని రకాల పూలు చుక్కలనంటడంతో మధ్యతరగతి వినియోగదారులు ఏమీ కొనకుండానే వెనుదిరగాల్సి వచ్చింది.






ఏ పూలూ కొనలేం







# దేవుడా..నీకో దండం

### నేడు శ్రావణ శుక్రవారం

### పూల మార్కెట్‌లు కిటకిట

### కొనుగోళ్ల కోసం భారీగా పోటెత్తిన వినియోగదారులు

### అమాంతం ధరలు పెంచేసిన వ్యాపారులు

### కొనలేక వెనుదిరిగిన మధ్యతరగతి వర్గాలు






సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

# పిల్లల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయం

### -నులిపురుగు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### -జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** జిల్లాలో జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అనుబంధ శాఖల అధికారులను సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహణ సందర్భంగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రాధాన్యతా క్రమంలో ముందుగా కార్యక్రమం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అలాగే అన్ని అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, మదర్సాలు, జూనియర్ కళాశాలలలో ఈనెల 11 నుండి 18 వరకు జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమాన్ని అనుబంధ శాఖల అధికారులు 119 సంవత్సరాల పిల్లలకు టాబ్లెట్స్ తప్పక అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పిల్లలలో అనేమియా, ( రక్తహీనత ), పోషకాహార లోపం, కడుపునొప్పి అలాగే డయేరియా సమస్యలు తరచుగా వస్తూ ఉంటాయని అన్నారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల్లో పిల్లలకు సగం మాత్ర, రెండు నుండి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర ,అలాగే 3 నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర అందించాలని తెలిపారు. ఇంకా మాత్రలు తీసుకొని పిల్లలు ఉంటే ప్రత్యేక దృష్టి పెట్టి నూరు శాతం అందే విధంగా చూడాలని అన్నారు. ముందుగానే ప్రైవేట్ పాఠశాలలకు కార్యక్రమం నిర్వహణ సందర్భంగా సమాచారం అందించాలని, అలాగే టాబ్లెట్స్ వలన ఎలాంటి హాని ఉండదని కొన్ని ప్రాంతాలలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఎంఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, ఆర్. రోహిణి, డిఐఓ డాక్టర్ శ్రీధర్, సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయ్..ఎంజాయ్

### మాదక ద్రవ్యాల మత్తులో జోగుతున్న యువత

### ఏ ఒక్కటీ ఫలితమివ్వని పోలీసుల ప్రయత్నాలు

### తాజాగా పోలీసులకు పట్టుబడిన వైద్య విద్యార్థులు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసిన గంజాయి గుప్పుమంటుంది. మత్తును అస్వాదిస్తూ యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట గంజాయి, మాదకద్రవ్యాలతో నిందుతులు పట్టుబడటం కలకలం రేపుతోంది. పోలీసులు తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్న పెడ్లర్లలో మార్పు రావడం లేదు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రించడానికి అటు ప్రభుత్వం, ఇటు పోలీసు శాఖ ఎన్ని ప్రయత్నాలు చేసిన అనుకున్న మేర ఫలితాలు సాధించలేకపోతున్నారు. ముఖ్యంగా యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మెడికోలు, వైద్యులు మొదలుకొని పాఠశాల విద్యార్థులు సైతం మాదకద్రవ్యాలు సేవిస్తూ పట్టుబడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టుబడిన నిందితులు, వినియోగదారులపై కేవలం కేసులు నమోదు చేసి వదిలేయకుండా వారు జీవితంలో మళ్లీ మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. అప్పుడే రాష్ట్రంలో మత్తుపదార్థాలను పూర్తిగా రూపుమాపవచ్చని సూచిస్తున్నారు.

**మత్తుకు బానిసలుగా మారుతున్న యువత..**


స్నేహితులు, పరిచయస్తులతో నెమ్మదిగా అలవాటైన మత్తు పదార్థాల వాడకం తర్వాత కాలంలో వాటిని సేవించకుండా ఉండలేమనే స్థితికి తీసుకొస్తున్నాయి. క్రమంగా మత్తుకు అలవాటు పడిన బాధితులు.. వాటి విక్రయాల ద్వారా అత్యధిక డబ్బు వస్తుందనే ఆశతో పెడ్లర్ల చేతిలో కీలు బొమ్మలుగా మారుతున్నారు. గంజాయి, డ్రగ్స్ సేవించడంతో పాటు వాటి సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కి కటకటాలపాలవుతున్నారు. క్షణికావేశంలో వేసిన తప్పటడుగు తమ తల్లిదండ్రులకు జీవితాంతం కన్నీటి శోకాన్ని మిగిలిస్తున్నాయి.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన వైద్య విద్యార్థులు..

విశ్వసనీయ సమాచారం మేరకు హెచ్ఎన్‌పీఎస్, ఈగల్(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి ఇద్దరు గంజాయి సప్లయర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద



నుంచి 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణలో భాగంగా నిందితుల కాల్ లిస్ట్ చెక్ చేసిన అధికారులకు దిమ్మతిరిగే విషయం తెలిసింది. వారి నుంచి ఎక్కువగా గంజాయి కొనుగోలు చేస్తున్నది మెడికల్ కాలేజీ విద్యార్థులని తెలుసుకొని నిర్ఘాంతపోయారు. ఈ క్రమంలో గంజాయి కొనుగోలు చేసిన మొత్తం 32 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో ఇద్దరు మహిళ విద్యార్థులతో కలిపి మొత్తం 9 మందికి గంజాయి టెస్ట్ పాజిటివ్ వచ్చింది. దీంతో వారి తల్లిదండ్రులను పిలిపించి, మెడికోలకు కౌన్సిలింగ్ నిర్వహించి రీహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు.



# వెలగని వీధిలైట్లకూ బిల్లు!

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని స్ట్రీట్ లైట్ మెయింటనెన్స్‌లో తలెత్తుతున్న లోపాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తుంది. కొద్ది నెలల క్రితం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) స్ట్రీట్ లైట్ల నిర్వహణ ఒప్పందం ముగియటంతో తాత్కాలికంగా నిర్వహణ బాధ్యతలను మూడు నెలల పాటు ఈఈఎస్ఎల్‌కే అప్పగించిన జీహెచ్ఎంసీ ఇటీవలే స్ట్రీట్ లైట్ల మెరుగైన నిర్వహణ కోసం పేరుగాంచిన సంస్థల నుంచి ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈఓఐ)లను ఆహ్వానించగా, ఆరు సంస్థలు ఈఓఐ బిడ్లను సమర్పించగా, జీహెచ్ఎంసీ ఆ జాబితాను సర్కారుకు పంపింది. స్ట్రీట్ లైట్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన పిలిప్స్, కాంప్టన్ గ్రీవ్స్ వంటి సంస్థలు కూడా ఆజాబితాలో ఉన్నట్లు తెలిసింది. సర్కారు నుంచి నిర్ణయం వచ్చే లోపు జీహెచ్ఎంసీ లోని స్ట్రీట్ లైట్లకు అత్యాధునిక, ఉత్తమమైన నిర్వహణ వ్యవస్థను ప్రవేశపెట్టాలని జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో దాదాపు 5.50 లక్షల స్ట్రీట్ లైట్లున్నాయి. వీటిలో కొన్ని ఆటోమెటిక్ స్విచ్‌లతో పని చేయగా, మెజార్టీ సంఖ్యలో లైట్లు మ్యానువల్ నిర్వహిస్తున్నారు. లైట్ల నిర్వహణలో విద్యుత్ చౌర్యం, మరమ్మతుల్లో అవినీతి, అలసత్వం వంటి వాటికి చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ ఔటర్ రింగ్ రోడ్డు, ఢిల్లీ నగరం తరహా లుమినార్ లైట్ కంట్రోల్(ఎల్ సీసీ), లుమినార్ యూనిట్ కంట్రోల్(ఎల్‌యూసీ) విధానాలను పరిశీలిస్తుంది. ఈ విధానాలను కమాంట్ కంట్రోల్ మానిటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్ )కు అనుసంధానం చేసి, వెలిగే లైట్లకు విద్యుత్ బిల్లులు వచ్చేలా, వెలగని లైట్లను గుర్తించి మార్చేలా సరి కొత్త వ్యవస్థను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం జీహెచ్ఎంసీ ఎలక్ట్రిక్ వింగ్ మిగతా 3లో

### కార్పొరేషన్‌కు విద్యుత్‌శాఖ షాక్

### ప్రతినెల రూ.6 కోట్ల వరకు చెల్లింపులు

### అకస్మాతుగా రూ. 2 కోట్లు పెరగడంపై జిహెచ్ఎంసి అప్రమత్తం

### పనిచేయని విద్యుత్ స్తంభాలకు బిల్లు పడుతోందని నిర్ధారణ

### కరెంటు సిస్టమ్‌లో చౌర్యం జరుగుతోందని అనుమానం

### సిసిఎంఎస్ విధానంతో చెక్ పెట్టాలని నిర్ణయం



రాఖీలు పంపిణీ చేస్తున్న వైష్ణవి యాదవ్

## ఆరు వేల రాఖీలు ఉచితంగా పంపిణీ

**అడ్డగుట్ట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో మోండా డివిజన్ కాంగ్రెస్ నాయకురాలు చిర్రబోయిన వైష్ణ గురువారం ఇంటింటికి వెళ్లి ఉచితంగా రాఖీలు పంపిణీ చేశారు. అన్న, తమ్ములకు రాఖీలు కట్టే ఆడపడుచులకు భారం పడకుండా నాణ్యతతో కూడిన 6 వేల రాఖీలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూజారి సాంబయ్య, పి.నర్సింగ్ రావ్, ఎస్.వెంకటేశ్, సురవి శ్యామ్ సుందర్‌రెడ్డి, బొట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## శ్మశానవాటికకు రూ.3కోట్లు మంజూరు

**కంటోన్మెంట్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన క్రిస్టియన్ మైనార్టీ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ బోయగూడ బరేల్ గ్రౌండ్ (గ్రేవ్ యార్డు), అభివృద్ధికి 3 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ప్రశాంత్,కార్యదర్శి జయరాజ్ ప్రతినిధులు విజయ్ పాల్, విలియం, ప్రనయ్, సునీల్, దేవదాస్, జయ, సురేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం

**కంటోన్మెంట్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 6వ వార్డులోని కుమ్మరిగుట్ట తాడ్‌బండ్ హన్‌మాన్ టెంపుల్, రాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ ప్రారంభించారు. బిజెపి నాయకులు ప్రతీక్ జైన్, మురుగేషన్,శ్రావన్,రవిందర్ రెడ్డి,బణాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**అడ్డగుట్ట, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. గురువారం మోండా డివిజ్‌లోని శివాజి నగర్ చాపల బజార్, రెజిమెంటల్ బజార్, మారేడ్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిజెపి డివిజన్ అధ్యక్షులు జి.తూ గుప్త, ప్రశాంత్, గణేష్,రాహుల్, నర్సింగ్, విశాల్ పాల్గొన్నారు.



తనిఖీకి వచ్చిన డిసిపి రాహుల్ హెగ్డేతో సిబ్బంది

## గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ

**కంటోన్మెంట్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా మెరుగైన సేవలు అందించాలని ట్రాఫిక్ అడిషనల్ డిసిపి రాహుల్‌హెగ్డే ఆదేశించారు. గురువారం అయన గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండిగ్ ఫైళ్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. విధి నిర్వాహన పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసిపి శంకర్‌రాజ్,ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐలు హరిశ్ గౌడ్, బాసు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి నగర్‌లో అన్నదానం

**కంటోన్మెంట్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఆరవ వార్డు నందమూరి నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ పాండు యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు దినేశ్, శ్యామ్ గౌడ్,ఉమా కాంత్,బాల్‌రెడ్డి, నరేశ్, విట్టల్, వెంకటేశ్, శ్రీనివాస్ యాదవ్, పద్మ, భాగ్య,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థుల దృశ్యం

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**నార్సింగి, ఆగస్టు 7 ప్రభాతవార్త :** రోడ్డుపై వెళ్లే ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ విభాగం అధికారులు నీతా వద్దేరే, నవీన్‌చారిలు సూచించారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ పాఠశాలలో విఆర్4యు చారిటేబుల్ ట్రస్టు సహకారంతో విద్యార్థులకు నిర్వహించిన ట్రాఫిక్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వారితో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వలన జరిగిన ప్రమాదాలు, మరణాలు, వికలాంగత్వం, తల్లిదండ్రులు పడే దుఃఖం, కష్టం, పోలీసులు తీసుకునే చట్టపరమైన చర్యలు, జరిమానాలు, జైలు శిక్షలపై వీడియోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు మల్లేశ్వరరావ్, మస్తాన్‌వలీ, శివ నాగేశ్వర్, ట్రస్టు సభ్యులు దిలీప్ కక్కడ్, సుమ నళిని, ఉపాధ్యాయులు రావుఫ్, శివరామ్, రజనీ, స్వాతి, అనుపమ, కవీందర్, విజయ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా కోరులనుంచి ప్రభుత్వ స్థలానికి విముక్తి

### కంచె వేసిన హైడ్రా అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, గాజుల రామారంలోని భగత్ సింగ్ నగర్‌లో ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. 2 వేల గజాలకు పైగా ఉన్న స్థలం చుట్టూ గురువారం కంచె వేసి హైడ్రా పరిరక్షి ంచింది. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు.. ఇతర ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమి కబ్జాకు గురౌతోందని భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిరక్షణ సమితి ఫిర్యాదు మేరకు హైడ్రా పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. ప్రజావసరాలకు ప్రభుత్వం కేటాయించిన భూమిగా నిర్ధారించుకుంది. 2021లోనే స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ. 26.8 లక్షలు జీహెచ్ ఎంసీ నిధులు మంజూరు చేసింది. కొంతమేర ప్రహరీ నిర్మాణాన్ని కూడా చేపట్టింది. పనులు పూర్తి కాకపోవడంతో కబ్జాలకు తెరదీసినట్టయ్యింది. ఇదే విషయాన్ని హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో వెంటనే కబ్జాలకు తెరదించుతూ చుట్టూ కంచె వేసింది.

# మళ్లీ వస్తా.. తనిఖీ చేస్తా

- బోరబండ, నందినగర్ బస్తీల్లో సిఎండి తనిఖీలు
- వంగి పోయిన స్తంభాలు, వేలాడుతున్న వైర్లను చూసి తీవ్ర అసహనం
- విద్యుత్ నెట్వర్క్ లోపాలు సరిచేయాలని వార్నింగ్



విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న సిఎండీ ముషారఫ్, డైరెక్టర్ నర్సింహులు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లోని బస్తీలు, చిన్న చిన్న గల్లీలు, ఇండ్ల ముందు ప్రమాదకరంగా వున్న ఎల్‌టి ఓవర్ హెడ్ కండెక్టర్ల స్థానంలో ఎయిర్ బంచ్ కేబుల్ ను ఏర్పాటు చేయడం కొరకు టిజిఎస్‌పిడిసిఎల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గురువారం ఉదయం దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ బంజా రాహిల్స్ సర్కిల్ పరిధిలోని బోరబండ, నందినగర్ బస్తీల్లో కాలినడకన పలు వీధుల్లో తిరుగుతూ నెట్వర్క్‌ను తనిఖీ చేసారు. ఈసందర్భంగా విద్యుత్ స్తంభాలపై గుట్టలుగా వేలాడుతున్న దృశ్యాలు, వంగి పోయిన స్తంభాలను చూసి తీవ్రంగా స్పందించిన సిఎండీ ఆయాలోపాలాన్ని వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరికొద్దిరోజుల్లో ఈ ప్రాంతాలల్లో మళ్ళీ ఆకస్మిక తనిఖీ చేస్తానని నెట్వర్క్‌లో ఏవైనా లోపాలు ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. సీఎండీ తో పాటు ఆపరేషన్ డైరెక్టర్ డా. నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, బంజార హిల్స్ సూపెరింటెండింగ్ ఇంజినీర్ కరుణాకర్ బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న విభిన్న ఆకృతుల రాఖీలు

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** రక్షాబంధన్ అన్నది అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, అనుబంధానికి ప్రతీకగా జరిపే హిందూ పండుగ. శ్రావణ పౌర్ణమి రోజున చెల్లి తన అన్నయ్య చేతికి రాఖీ కట్టి, ఆపదల్లో తనను కాపాడాలని కోరుకుంటుంది. ఇది కుటుంబ బంధాలను బలపరచే పండుగగా దేశవ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకుంటారు. రక్షాబంధన్ సందర్భంగా మార్కెట్లలో రాఖీలు, బహుమతులు, చాక్లెట్లు, ఫ్యాషన్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటూ అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయి. 2024 సంవత్సరంలో రాఖీ వ్యాపారం రూ.12,000 కోట్ల వరకు చేరినట్లు ట్రేడర్ల సమాఖ్య అంచనా వేసింది. ఇది గతేడాది కంటే సుమారు 20 అధికం. బ్లింకిట్, స్విగ్గీ ఇన్స్టామార్ట్ వంటి ఆన్లైన్ ప్లాట్ఫార్మ్లు నిమిషానికి వందల రాఖీలు విక్రయించినట్లు తెలిపాయి. చిన్నారుల కోసం కార్టూన్ క్యారెక్టర్స్ రాఖీలు, ప్రధాని మోదీ చిత్రాలతో ఉండే రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్కెట్లో రూ.10 నుంచి రూ.50 వరకు ధరల్లో రాఖీలు విరివిగా లభిస్తున్నాయి. సంప్రదాయానికి కొత్త హంగులు కలిసిన రాఖీ పండుగ సందర్భంగా మెయిన్ మార్కెట్లు, ఆలయాలు సందడిగా మారాయి. రాఖీల డిమాండ్తో దేశీయ ఉత్పత్తుల అమ్మకాలు వేగంగా పెరిగాయి.





శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

## కుత్బుల్లాపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కొంపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** మౌలిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి బీరప్ప నగర్ టెంపుల్ రోడ్, జగద్గిరినగర్ రోడ్ నెం.1 కాలనీలలో సుమారు రూ.25లక్షల చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో కుత్బులాపూర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, సత్యనారాయణ యాదవ్, కోశాధికారి సుధాకర్, శ్రావణ్ కుమార్, కార్యనిర్వాహ కార్యదర్శిలు అనంతరెడ్డి, రామచంద్రయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్ రావు, సంపత్, వెంకట్ రెడ్డి, వెంకటెష్, హరినాథ్ రావు, సుధాకర్, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆజమ్, మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బండ మహేందర్, మెట్ల శ్రీను, చారి, విఠల్, నర్సింహా రెడ్డి, బ్రహ్మానంద చారి, సాజిద్, విఘ్నేష్, మహిళా నాయకురాలు ఇందిరా గౌడ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.




ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ చరణ్

## ఉస్మానియాలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహం,ఆత్మవిశ్వాసం ప్రశంసనీయమని ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయ చరణ్ అన్నారు.ఓయూలో గురువారం సి.ఎఫ్.ఆర్.డి భవనంలోని యూజి, పిజి విద్యార్థుల కోసం అగ్రతాస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను హెచ్.సి.డి.సి నిర్వహించింది. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రొఫెసర్ జి.విజయ చరణ్ ప్రారంభించి ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం తమ విద్యార్థులకు ప్రఖ్యాత కంపెనీలలో ప్లేస్‌మెంట్,ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడంపై దృష్టి పెడుతున్నామని తెలిపారు. డిజిటల్ యుగంలో ఉద్యోగ విజయానికి అవసరమైన నైపుణ్యాలు మరియు అనుభవాలతో విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలని కోరారు. సరైన శిక్షణ పొందడం ద్వారా కంపెనీలో చేరిన తర్వాత స్థిరమైన పనితీరును అందించడం ద్వారా విజయవంతమైన కెరీర్‌ను ఎలా నిర్మించవచ్చో ఆమె అభ్యర్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రతాస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ అధికారులు, ఓయూ విద్యార్థులు పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

## పోచమ్మ దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన

**కొంపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త :** 126 జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్‌లోని పోచమ్మ దేవాలయం పునః నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కెపి వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ అమ్మవారి దయతో దేవాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షి ంచారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని, అమ్మ దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్, సత్యనారాయణ యాదవ్, కోశాధికారి సుధాకర్, శ్రావణ్ కుమార్, కార్యనిర్వాహ కార్యదర్శిలు అనంతరెడ్డి, రామచంద్రయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్ రావు, సంపత్, వెంకట్ రెడ్డి, వెంకటెష్, హరినాథ్ రావు, సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆజమ్, మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బండ మహేందర్, మెట్ల శ్రీను, చారి, విఠల్, నర్సింహా రెడ్డి, బ్రహ్మానంద చారి, సాజిద్, విఘ్నేష్, మహిళా నాయకురాలు ఇందిరా గౌడ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 9నుంచి రేజంగ్ల కలశయాత్ర

### అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబుయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్

**ముషీరాబాద్, ఆగస్ట్ 7, ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రం నుంచి ప్రారంభమయిన రేజంగ్ల కలశయాత్ర ఈనెల 9నుంచి తెలంగాణలో నారాయణపేట్ మండలం నుంచి ప్రారంభమవుతుందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లోని అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న యాదవ కులస్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు చేపట్టిన రేజంగ్ల కలశయాత్ర తెలంగాణలోని వివిధ జిల్లాలలో పెద్ద ఎత్తున కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈనెల 16న హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్ నందు భారీ బహిరంగసభ, కలశయాత్ర పూజలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని అన్నారు. ఇండో చైనా యుద్ధంలో 114 మంది యాదవులు తమ ప్రాణాలను తెగించి, దేశం కోసం పోరాడి, అమరులయ్యారని గుర్తు చేశా రు. యాదవుల పోరాట పటిమను గుర్తించేందుకు భారత సైన్యంలో అరుదైన గుర్తింపు కోసం ఆయూర్(యాదవ్) రేంజ్‌మెంట్‌ను ప్రవేశపెట్టే విధంగా పార్లమెంటులో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గత 40 ఏళ్లుగా భారత సైన్యంలో ఆయూర్ రేంజ్‌మెంట్ పెట్టాలని పోరాటం చేస్తున్నామని, అందులో భాగంగానే రేజంగ్ల కలశయాత్ర దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యాత్రలో పెద్ద ఎత్తున యాదవ కులస్థులు పాల్గొని, యాత్రను విజయవంతం చేయాలని కోరారు. రేజంగ్ల కలశయాత్ర ముగింపు సభ మన రాష్ట్రంలోని సిరిపుర్ కాగజ్‌నగర్‌లో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ముఖ్య సలహాదారు బి.బాబూరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వలపు వలేసి

### భర్తకు విడాకులు ఇప్పించి..

**గర్భవతిని చేసి మొహం చాటేసిన కేటుగాడు**

**పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు**

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ప్రియుడిపై మోజుతో భర్తకు విడాకులిచ్చింది. పెండ్లి చేసుకుంటానని నమ్మించిన అతడు మోజు తీరగానే మొహం చాటేశాడు. గర్భవతి అయిన ఆమె మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన యువతి(24) హైదరాబాద్ మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఐదేళ్ల క్రితమే ఆమెకు వివాహం అయింది. భర్తతో మనస్పర్థల కారణంగా విడిగా ఉంటోంది. ఈ క్రమంలో ఆ యువతిపై దూరపు బంధువు గోపి(24) కన్నేశాడు. ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించి భర్తకు విడాకులివ్వాలని ఒత్తిడి చేశాడు. ప్రియుడి మాయమాటలు నమ్మిన ఆమె భర్తకు విడాకులు ఇచ్చింది. కొంతకాలానికి యువతి గర్భం దాల్చింది. ఎప్పటికప్పుడు పెళ్లి మాటను దాటవేస్తూ కాలం గడుపుతుండటంతో బాధితురాలు అప్రమత్తమైంది. తనను కాదని మరో యువతిని వివాహం చేసుకోబోతున్నాడని తెలుసుకుని గోపి కుటుంబ సభ్యులతోపాటు అతను పెళ్లి చేసుకోబోయే యువతి కుటుంబాన్ని కూడా కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. అయితే గోపి సోదరుడు తీవ్ర పదజాలంతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డాడు. చేసేది లేక తనకు జరిగిన అన్యాయంపై ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి కేసును కేపీహెచ్‌బీ ఠాణాకు బదిలీ చేశారు.

## జస్మత్ పటేల్ సేవలకు అభినందన

**సైఫాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** గుజరాతీ సమాజ్ విశాఖపట్నం ఛైర్మన్, ట్రస్టీగా ప్రముఖ సంఘ సేవకులు జస్మత్‌పటేల్ నియమితులైనారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని లవ్ ఫర్ కౌ ఆధ్వర్యంలో గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఆయనకు ఘనంగా సత్కారం జరిగింది. రితిష్ జాగీర్థార్, మహేష్‌అగర్వాల్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా జస్మత్ పటేల్ పాత దేవాలయాలు, గోశాలలు, జంతు సంక్షేమం, ఇతర సామాజిక కార్యక్ర మాలను చేపట్టడం జరిగిందన్నారు. ఆయన చేసిన సేవా కార్యక్ర మాలకు గౌరత్న జాతీయ అవార్డు, హిందూ రత్న పురస్కారం, ఆనేకం ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర, జాతీయ అవార్డులను అందుకున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు రమేష్‌జాగీర్థార్, రామచంద్ర మహారాజ్ తదితరులు పాల్గొని ఆయన్ని ఘనంగా సత్కరించారు.



జస్మత్‌పటేల్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు



గాయిత్రి నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

## ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

**సంజీవరెడ్డి నగర్,ఆగస్టు 7 ప్రభాతవార్త:** రెండు మూడు రోజులలో నాలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమీర్‌పేట్ డివిజన్‌లోని గాయిత్రి నగర్‌లో చేపట్టిన నాలా నిర్మాణం పనులు పూర్తి కాకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించాలని కాలనీ వాసులు ఇటీవల మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో విన్నవించుకోవడంతో స్పందించిన తలసాని అధికారులతో సమీక్షించారు. నాలాను పరిశీలించారు. నాలా పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సఫ్టింగ్ పనులను అధికారులు ప్రారంభించగా నాలా పై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఇ.వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్సు జిఎం ప్రభాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి సయ్యద్, ఎలక్ట్రికల్ ఏడి కిషోర్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ముత్యాల హన్మంతరావ్, సీనియర్ నాయకులు అశోక్ యాదవ్,ప్రవీణ్‌రెడ్డి, నామన సంతోష్‌కుమార్, కూతురు నర్సింహ్మ, గోపిలాల్ చౌహాన్, టిల్లూబాయ్, కట్ట బలరామ్, సుమిత్ సింగ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలింగ్ లోపాలపై ప్రత్యేక కమిటీ

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బిసి విద్యార్థుల పోరాట ఫలితంగా ఎఫ్‌సెట్ అవకతవకలపై, ఇంజనీరింగ్ కళాశాల్లో తనిఖీలకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామ కృష్ణ అన్నారు. గురువారం ఆయన బిసి విద్యార్థి నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగిన పోరాట ఫలితంగా ప్రభుత్వం స్పందించిందన్నారు. ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌లో జరుగుతున్న లోటుపాట్లను ఇప్పటికైన ప్రభుత్వం సరిదిద్ది విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు.సీట్ల కేటాయింపులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదని, అమ్మాయిల కోటా సీట్లను నిబంధనలకు విరుద్ధంగా అబ్బాయిలకు కేటాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో విద్యార్థి నేతలు నరేష్, కిరణ్, వరుణ్, అర్జున్. గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పటేల్ ప్రతిభ

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బెంగళూర్‌లో జరిగిన 13వ షోటోఖాన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శ్రీచైతన్య స్కూల్ బర్కతపురా బ్రాంచ్ 8వ తరగతి విద్యార్థి లక్కాకుల అన్విత్ పటేల్ తెలంగాణ రాష్ట్రం తరపున జీవీ ఆర్ కరాటే అకాడమీ ద్వారా కటా, కుమితి విభాగాల్లో పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. అకాడమి విద్యార్థులతో కలిసి ఓవరాల్ ఛాంపియన్ షిఫ్ ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ రూబీనా అన్విత్ పటేల్‌ను సత్కరించి అభినందించారు. స్కూల్ డీన్ రమేష్, సీ బ్యాచ్ ఇంచార్డ్ గాయాత్రి, టీచర్స్ కె.క్రిష్ణకుమారి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అన్విత్ పటేల్‌ను అభినందిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ రూబీనా

## రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య చికిత్సలు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు భరోసా

**చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పేర్కొన్నారు. గురువారం సచివాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(టిఎస్‌జిఆర్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు బి.దామోదర్‌రెడ్డి రాష్ట్ర సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం రామ కృష్ణ రావును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించింది. పెన్షనర్ల ముఖ్య సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రాతినిధ్యం చేయనైనది. సమస్యలలో అతి ముఖ్య మైన ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత ఆరోగ్య చికిత్స అమలుకై వెంటనే చర్యలు తీసుకునే విధంగా తగిన ఉత్తర్వులను జారీ చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి తప్పని సరిగా తొందరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంఘం ప్రతినిధి బృందంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర కార్యదర్శి లక్షీ ్మ నరసింహ రావు, నల్గొండ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర టిఎస్‌జిఆర్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.దామోదర్‌రెడ్డి



తెలంగాణ బిజెపి అధ్యక్షుడు ఎన్.రాంచందర్రావులను సత్కరిస్తున్న లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురాంరెడ్డి

## కార్మికులకు సరైన న్యాయం అందేలా కృషి చేయాలి

### తెలంగాణ బిజెపి అధ్యక్షుడు ఎన్.రాంచందర్రావు

**చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కార్మిక సంక్షేమం, పరిశ్రమలు, యాజమాన్యం తదితర సమస్యల సత్వర పరిష్కారానికి లేబర్ కోర్టు న్యాయవాదులు మరింత నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్రావు కోరారు. న్యాయవాదులు ఆ దిశలో ముందుకు సాగాలని కోరారు. గురువారం లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురాంరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం రామచందర్ రావు ను కలిసి సత్కరించి అభినందించారు. అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత మొదటిసారి రాంచందర్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు తగిన న్యాయం అందించే విధంగా న్యాయవాదులు కృషి చేయాలనీ అన్నారు.



చేనేత ప్రముఖులను సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

## నాగరికత ప్రగతిలో చేనేతకు విశిష్ట స్థానం

### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మానవ నాగరికత ప్రగతిలో చేనేతకు విశిష్టమైన స్థానం ఉందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ప్రజా ప్రభుత్వం చేనేత పునరుజ్జీవం కోసం, చేనేత కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం పని చేస్తోందని ఒక సందేశంలో అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాంనగర్ లోని దత్తాత్రేయ నివాసంలో చేనేత వర్గానికి చెందిన ప్రముఖులను సత్కరించే కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాజముద్ర చిత్రకారుడు లక్ష్మణ్ ఏలె, జాతీయ కవి సుద్దాల అశోక్ తేజ, చేనేత కార్మికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత.చింతకింది మల్లేశం, చేనేత కళల రూపకర్త గజం గోవర్ధన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య , భోగ సరస్వతి తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైష్ణవ్ బండారు విజయ లక్షి ్మ, మాజీ ఎంఎల్ఏ వన్నాల శ్రీరాములు, మ్యాడం బాబు రావు, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ చేనేత కార్మికుల పాత బకాయిలు విడుదల చేయడంతో పాటు, లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయడం జరిగిందని చెప్పారు. చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధికి తెలంగాణ చేనేత అభయ హస్తం పథకం, తెలంగాణ నేతన్న పొదుపు, నేతన్న బీమా, తెలంగాణ నేతన్నకు భరోసా వంటి వినూత్న కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్‌లపై అందరిదీ మోసమే

### ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

**సైఫాబాద్, అగస్టు 7, ప్రభాతవార్త:** బిసిలకు రిజర్వేషన్‌లు పెంచుతామని సాధ్యం కాని హామీలు ఇస్తూ బిసిలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని, రిజర్వేషన్‌లు పెంపు సాధ్యం కాదని తెలిసి కూడా బిఆర్ఎస్, బిజెపి పార్టీలు వంత పాడటం రాజకీయ పార్టీల దివాళా కోరుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు.

## డీల్ ఏదైనా రె'ఢీ'

(మొదటి పేజీ తరువాయి)

యజమానికి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కానీ, బిల్డర్ ఒప్పందాన్ని ఉల్లంఘించి తనకు పరిచయం ఉన్న రౌడీషీటర్‌తో బెదిరింపులకు దిగాడు. పోలీసులు, కేసులు అంటూ వెళ్తే కుటుంబాన్ని మొత్తం చంపేస్తామని రౌడీషీటర్ వార్నింగ్ ఇవ్వడంతో చేసేదేమి లేక ఆ స్థల యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**రౌడీ ఆర్మీ రిక్రూట్‌మెంట్**

మరోవైపు సెటిల్‌మెంట్ల దందాను జోరుగా కొనసాగిస్తున్న తాజా, మాజీ రౌడీషీటర్లు యువకులతో గ్యాంగులు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దగా చదువుకోకుండా అవారాగా తిరిగే వారిని చేరదీస్తారు. వారిలో ధైర్యం ఉన్న యువకులను గుర్తించి నవారికి ప్రతిరోజు మందు, బిర్యానీ సమకూరుస్తారు. వారిని సెటిల్‌మెంట్ వ్యవహారాల్లోకి దింపుతారు. టార్గెట్ చేసిన వ్యక్తులను బెదిరించటం, దాడి చేయడం వీరి డ్యూటీ. ఆయా వ్యవహారాలకు సంబంధించి వసూలు చేసిన సొమ్ము నుంచి కొంత మొత్తాన్ని గ్యాంగ్ సభ్యులకు పంచుతున్నారు. కొంతమందికైతే నెలకు ఇంత అని వేతనం ఉంటుంది. అన్న ఏ పని చెప్పినా తూచ తప్పకుండా పూర్తిచేయడం ఈ రౌడీ ఆర్మీ పని. ఈ క్రమంలో అరెస్ట్ అయితే అన్న బెయిల్ ఇప్పించి బయటకు తీసుకు వస్తాడన్న ధైర్యం వాళ్లలో ఆయా రౌడీ బాస్‌లు నింపుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిరంతర నిఘా పెట్టాల్సి ఉంటుంది. వాళ్లు మాజీ రౌడీషీటర్లయినా, ప్రస్తుత రౌడీషీటర్లయినా స్థానిక పోలీసుల్లో కొందరు అమ్యామ్యాలకు అలవాటు పడి వీరిని చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ పహిల్వాన్ ఇంటికి వెళ్లిన పదుల సంఖ్యలో జనం ఉండటం, సెటిల్‌మెంట్లు జరుగుతుండటం సర్వ సాధారణ దృశ్యాలే. స్థానిక పోలీసులకు ఇవన్నీ తెలిసినా తెలియనట్టే ఉంటారు. నిజానికి ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులు పంపించాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మాజీ రౌడీషీటర్లు హద్దు దాటి వ్యవహరిస్తున్నారని నిర్ధారణ అయితే వారిపై తిరిగి రౌడీషీట్ ప్రారంభించాలి. ఈ దిశగా స్థానిక పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా తాజా, మాజీ రౌడీషీటర్లు, పహిల్వాన్‌లు ఆడింది ఆటగా పాడింది పాటగా ఉంది. ఇబ్బందులుపడ్డారు. పలుచోట్ల నీరు నిలువడంతో ఇబ్బందిపడ్డారు. భారీ వర్షం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ జీహెచ్‌ఎంసీ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని చెప్పింది.

## నగరం ఆగమాగం

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. భాగ్యనగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. మాదాపూర్, హైటెక్ సిటీ, ఐకియా, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, పంజాగుట్ట, అమీర్‌పేట, బేగంపేట్, హిమాయత్‌నగర్, సికింద్రాబాద్, హబ్సిగూడ, ఉప్పల్, చాదర్‌ఘాట్, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఖైరతాబాద్ నుంచి జూబ్లీహిల్స్, కొండాపూర్ మార్గంలో పెద్దఎత్తున వాహనాలు నిలిచి పోయాయి. లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్‌లో ఇదే పరిస్థితి నెలకొంది.

**అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి: సిఎం రేవంత్‌రెడ్డి**

వర్షాలతో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అప్రత్తమైంది. భారీ వర్షకారణంగా ప్రభుత్వ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జిహెచ్‌ఎంసితోపాటు పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు.

## అనుమానం పెనుభూతమై..

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబీకులు పోలీసులకు తెలియజేసారు. ఇంటికి వచ్చిన తన స్నేహితుల విషయంలో కూడా అనుమానం పెంచుకోవడంతో పాటు వేధించడంతో తీవ్ర మనోవేదనకు గురైన యువతి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయనానికి పాల్పడిందన్నారు. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాంగోపాల్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వెలగని వీధి లైట్లకూ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆఫీసర్లు, సీపీడీసీఎల్ అధికారులతో ఓ కీలకమైన సమావేశం జరిగింది. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలోని 650 చదరపు కిలోమీటర్లలోని మెయిన్ రోడ్లు, సబ్ రోడ్లు, కాలనీ రోడ్లతో పాటు మొత్తం 5.50 లక్షల స్ట్రీట్ లైట్లున్నాయి. వీటితో పాటు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం మొదలుకుని, జోన్, సర్కిల్, వార్డు కార్యాలయాల్లో కలిపి జీహెచ్‌ఎంసీ నెలకు రూ.8 కోట్ల వరకు కరెంటు బిల్లులను చెల్లిస్తుంది. కొద్ది సంవత్సరాల క్రితం వరకు ఈ కరెంటు బిల్లు రూ.6 కోట్ల వరకు ఉండగా, ఇటీవల పెరిగిన స్ట్రీట్ లైట్ల సంఖ్యను బట్టి అదనంగా వస్తున్న రూ.2 కోట్ల కరెంటు బిల్లుల్లో లోపాలున్నట్లు జీహెచ్‌ఎంసీ అనుమానిస్తుంది. ఏకంగా రూ.2 కోట్ల కరెంటు బిల్లులు అకస్మాతుగా పెరగటంపై దృష్టి సారించిన జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ లైట్లకు సరఫరా చేస్తున్న కరెంటు సిస్టమ్ లో ఎక్కడో చౌర్యం జరుగుతుందని భావిస్తుంది. మరి కొన్ని చోట్ల వెలగని వీధి లైట్లకు కరెంటు బిల్లు రావటానికి బ్రేకే వేసేందుకు కూడా జీహెచ్‌ఎంసీ సిద్దమైంది. కేవలం వెలిగే స్ట్రీట్ లైట్లకు బిల్ వచ్చేలా, వెలగని స్ట్రీట్ లైట్ ను సీసీఎంఎస్ ద్వారా గుర్తించి, సత్వరమే మరమ్మతులు చేపట్టేలా సరి కొత్త విధానాన్ని త్వరలోనే నగరానికి పరిచయం చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.


## 11మంది బాలకార్మికులకు విముక్తి

**పనులు చేయిస్తున్న నలుగురు వ్యాపారుల అరెస్టు**

**చార్మినార్, ఆగష్టు 7, ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా బాల కార్మికుల చేత బంగారం ఆభరణాలు పని చేయిస్తున్న నలుగురు వ్యక్తులను చార్మినార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారం ఆభరణాల తయారు చేసే దుకాణంలో పని చేస్తున్న 11 మంది బాల కార్మికులను పోలీసులు విముక్తి చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం......ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బంగారం ఆభరణాలు తయారు చేసే దుకాణాలలో పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన జీబాన్ (25) వద్ద ఐదు మంది, అలంగిర్ (47) వద్ద ముగ్గురు, అస్గర్ (32) వద్ద ఒకరూ, నబేదార్ (25) వద్ద ఇద్దరు బాల కార్మికులు గత కొంత కాలం నుంచి పని చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరిపి బాల కార్మికులకు విముక్తి కలిగించారు. నిబంధనలకు విరుద్ధంగా బాల కార్మికుల చేత పని చేయిస్తున్న బంగారు ఆభరణాల తయారు చేసే దుకాణాల యజమానులు జీబాన్, అలంగిర్, అస్గర్, నబేదార్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు

**చార్మినార్, ఆగష్టు 7 ప్రభాతవార్త :** భద్రావతి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం రాజన్నబౌలిలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు జరిగాయి. బిజెపి రాష్ట్ర నాయకులు, దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దోరేటి ఆనంద్ గుప్తా శ్రీ భద్రావతి చేనేత సహకార సంఘం చైర్ పర్సన్ వరకాల ప్రమీల దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పులికంటి సురేష్, సీనియర్ జర్నలిస్ట్ వి.యాదగిరి, పులికంటి వాణితో పాటు పలువురు పాల్గొని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.




బిజెపి నేత ఆనంద్ గుప్తాను సన్మానిస్తున్న దృశ్యం

# మరో రోడ్డు కుంగుబాటు

**-ఓల్డ్ మలక్ పేట్ రేస్ కోర్స్ రహదారిలో కలకలం**

**-డ్రైనేజీ పైప్ లైన్ల లీకేజీతో రహదారి విధ్వంసం**

**-తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన జలమండలి అధికారులు**



ఓల్డ్ మాలక్ పేటలో రోడ్డు కుంగిన దృశ్యం

**మలక్ పేట, ఆగష్టు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో కొద్ది రోజుల క్రితం బంజరా హిల్స్‌లో నాలా కుంగి లారీ ఇరుక్కు పోయిన సంగతి మరవకముందే మలక్ పేట నియోజకవర్గంలోని ఓల్డ్ మలక్ పేట డివిజన్‌లో రహదారి కుంగిపోయింది. డివిజన్ లోని రేస్ కోర్స్‌కు వెళ్లే రహదారిలో పంచశీల లైబ్రరీ వద్ద బుధవారం రాత్రి రోడ్డు ఆకస్మాత్తుగా కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలియడంతో జిహెచ్‌ఎంసి, జలమండలి అధికారులు, చాదర్ ఘాట్ లా అండ్ ఆర్డర్ పోలీసులు, మలక్ పేట ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని రోడ్డును ఇరువైపులా బ్లాక్ చేసి రాకపోకలను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కుంగిపోయిన గుంతను పెకిలించి చూడగా డ్రైనేజీ లైన్ల ట్రంకు లైన్‌కు లింక్ అయినచోట రావి చెట్టు వేర్లు పైప్ లైన్లను తోసేయటంతో పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి మట్టి కోసుకుపోయింది. దీంతో ఒక్కసారిగా రోడ్డు కుంగిపోయి గుంత ఏర్పడింది. వెంటనే మరమ్మతులు చేపట్టిన జలమండలి బోర్డు అధికారులు గుంతలో మట్టిని తొలగించి చూడగా రెండు వైపుల నుంచి వచ్చిన డ్రైనేజీ లైన్లు ట్రంక్ లైన్ కు లింక్ అయినచోట లీకేజీ ఏర్పడ్డట్టు గుర్తించారు. సమాచారాన్ని అందుకున్న మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల రోడ్డు కుంగిన చోటుకి చేరుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టి కాలనీవాసులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా వాటర్ వర్క్స్ జిఎం, మలక్ పేట సబ్ డివిజన్ డీజీఎం సయ్యద్ హస్మత్ అలీలు సందర్శించి పరిశీలించారు. త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేసి రోడ్డును సరి చేస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు

## అర్ధరాత్రి వేళ.. బైక్‌లపై స్టంట్లు

**యువకుల చేష్టలతో ప్రయాణీకుల ఆందోళన**

**అత్తాపూర్ ఆగష్టు7, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండలం పరిధిలో ఆకాతాయిలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. నిత్యం మెహిదిపట్నం నుండి ఆరంఘర్ వెళ్లే మార్గంలో బైక్‌లతో రోడ్డుపై విన్యాసాలు చేస్తూ ఇతరలను బయాందోళనకు గురి చేస్తున్నారు. గతంలో ఇలాగే అత్తాపూర్‌లో బైక్‌లపై విన్యాసాలు చేస్తే వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. తాజాగా బుధవారం రాత్రి రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ ప్లైఓవర్‌పై కొంతమంది యువకులు స్కూటీలపై ప్రమాదకరంగా స్టంట్లు చేస్తూ ఇతర వాహనాదారులకు ఇబ్బందులకు గురిచేయడంతో పాటు భయాందోళన కలిగించారు. ఓవైపు విన్యాసాలు చేస్తూ మరోవైపు రీల్స్ కోసం విడియోలు తీసుకుంటూ వారు రెచ్చిపోయారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా స్కూటీలను నడుపుతూ కెమెరాలకు చిక్కాడంతో సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. ఇలాంటి వారిపై పోలిసులు కఠిన చర్యలు తీసుకోవాలని వాహనాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## 13న కృష్ణుని వేషధారణ పోటీలు

**చిక్కడపల్లి, ఆగష్టు 7 ప్రభాతవార్త:** ఈ నెల 14 వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని 13 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని మొదటి అంతస్తులోని కళా సంగీత నాట్య వేదిక పై కృష్ణుని భిన్న వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు చిక్కడపల్లి శాఖ నిర్వాహకులు బి.జయశ్రీ తెలిపారు. ఈ పోటీలు వ్యక్తిగతం లేదా జత గా( రాధా కృష్ణ లు) పాల్గొనవచ్చునని, పాల్గొనే వారు గీతా శ్లోకం,లేదా సంబధిత లఘు దృశ్యం, పాట, నృత్యం లేక మరేదైనా ప్రక్రియ చూపాలి గ్రూపు 1 లో 1తరగతి నుంచి 3 వ తరగతి వరకు గ్రూపు 2 లో 4 వ 5 వ తరగతి వారు గ్రూపు 3 లో 6 వ 7 వ తరగతి చదివే పిల్లులు అర్హులు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది. పోటీలు లో పాల్గొనే వారు ఎట్టి రుసుము చెల్లించకుండా 12 వ తేదీ లోగా పేరు నమోదు చేసుకోవాలి ఇతర సమాచారం కోసం సెల్ 9396523408 ద్వారా సంప్రదించవచ్చు.

## ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించండి

**పట్టాభి టవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి ఫిర్యాదు**

**చిక్కడపల్లి, ఆగష్టు 7 ప్రభాతవార్త:** నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో గల డాక్టర్ శంకర్ పీపుల్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ శంకర్, అతని అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని పట్టాభి టవర్స్ ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి సత్యనారాయణ ,కార్యదర్శి యు యు విజయభాస్కర్, కోశాధికారి జి జగన్మోహన్ రెడ్డి లు చిక్కడపల్లి పోలీసులకు తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టాభి టవర్స్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ శంకర్స్ హాస్పిటల్ ఎండి తమ అపార్ట్మెంట్ పక్కన జిహెచ్‌ఎంసి నిబంధనలకు విరుద్ధంగా హాస్పిటల్ లో నిర్మించడమే కాకుండా అపార్ట్మెంట్ దారిని అతని భవనానికి దారి అని చూపించి తప్పుడు పర్మిషన్ తీసుకొని హాస్పిటల్ నిర్మించారని తెలిపారు ఈ విషయంపై తమ జిహెచ్‌ఎంసి కి ఫిర్యాదు చేయగా వారు ఆస్పటల్ భవనాన్ని కొద్ది రోజుల క్రితం సీజ్ చేశారని చెప్పారు దీంతో డాక్టర్ తమపై కక్ష పెంచుకొని ఫిర్యాదు వెనుక తీసుకోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు. ఒకవేళ ఫిర్యాదు వెనక్కి తీసుకోకపోతే మీ ఇంటికి వస్తాం మీ సంగతి చూస్తాం చంపేస్తామంటూ డాక్టర్ మనుషులు తమకు ఫోన్లు చేసి బెదిస్తున్నారని వారు తెలిపారు. మీరంతా రాయలసీమ మేమంతా లోకల్ వాళ్ళం మర్యాదగా ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కి తీసుకోండి అని గత కొద్ది రోజులుగా బెదిరిస్తున్నారని చెప్పారు ఈ విషయంపై చిక్కడపల్లి పోలీసులు వెంటనే స్పందించి వారి పైన చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని కోరారు. బెదిరించిన వారి పైన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో సిఐ రాజు ఎస్సై శివలకు వ్యక్తేపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు పోలీసులు న్యాయం చేయకపోతే న్యాయపరమైన చర్యలకు పోతామని తెలిపారు

సినీ కార్మికుల సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణంగా మద్దతు

సైఫాబాద్, ఆగష్టు 7 ప్రభాతవార్త: వేతనాల పెంపుకోసం సినీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఎఐటియుసి రాష్ట్ర సమితి సంపూర్ణంగా మద్దతు ప్రకటించింది. సినీమా టిక్కెట్ల రేటు పెంపు విషయంలో సిఎంని, రాష్ట్ర సినీమాటోగ్రఫీ మంత్రిని కలిసేందుకు యూనియన్‌లతో వెళుతున్న నిర్మాతల సంఘం నాయకులు సినీ కార్మికుల చేసే సమ్మెపై మాత్రం యూనియన్ల అవసరం లేదంటూ మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా చెప్పారు. సినీమాల కోసం నిర్మాతలు పెట్టిన పెట్టుబడిని రాబట్టుకోవడం కోసం ప్రభుత్వాలను సంప్రదించి, బెనిఫిట్ షోలతోపాటు టిక్కెట్ల రేట్లు పెంచుకోవడం, పన్ను తగ్గించుకోవడం వంటి చేస్తున్నారని, పెద్ద హీరోల సినిమాలకు 10, 20 రోజుల్లోనే పెట్టుబడి మొత్తం వస్తున్నదని, టిక్కెట్ల రేట్లు ఎంతపెరిగినా సినీ నిర్మాతలకే కోట్ల రూపాయలు లాభం వచ్చినా కార్మికులకు మాత్రం వరిగేది ఏమిలేదన్నారు. నిర్మాతలు, కార్మికుల మధ్య వచ్చిన వివాదాన్ని పరిష్కారించడానికి కార్మిక శాఖ కమిషనర్ మరొక సారి చర్చలు జరిపి న్యాయం చేయాలనినర్సింహ్మా కోరారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

**చిక్కడపల్లి, ఆగష్టు 11 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వెంకటేశ్వర స్వామికి ఎంతో ప్రీతిపాత్రమైన పవిత్రోత్సవాలలో మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు మంగళవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వేదమంత్రాల సాక్షి గా.. శ్రీవారు అమ్మవారితో కలిసి పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు పవిత్ర ఆహ్వానం, స్వస్తివచనం, రక్ష బంధనం, ఋత్విక్‌కరణము, అగ్ని ప్రతిష్ఠ, హవనం, వేద ప్రబంధ పారాయణము, ఆరగింపు, మంత్రంపుష్పం, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.



పురస్కారాలు ప్రదానం చేసిన దృశ్యం

## ప్రతిభావంతులను సత్కరించడం మంచి సంప్రదాయం

**జస్టిస్ బాషా నవాజ్ ఖాన్**

**చిక్కడపల్లి, ఆగష్టు 7, ప్రభాతవార్త:** వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించడం మంచి సంప్రదాయమని మల్కాజిగిరి కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ బాషా నవాజ్ ఖాన్ అన్నారు. గురువారం సాయంత్రం ఆరాధన కల్చరల్ అసోసియేషన్ అధినేత లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించే కార్యక్రమం జరిగింది. గంగోత్రి నిలయం చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిధిగా జస్టిస్ బాషా నవాజ్ ఖాన్ పురస్కారాలను అందించి గౌరవించారు. కార్యక్రమంలో హెలెన్ కేల్లర్ అధినేత డాక్టర్ ఉమర్ ఖాన్, కళాపోషకులు వి.వెంకట్ రావు, భాస్కర్ గుప్త పాల్గొనగా సభను యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీ నారాయణ, నాటకరంగ ప్రముఖులు చలపతి, పంచాంగకర్త ములుగు శివజ్యోతి, నిర్వహక సంస్థ ప్రతినిధులు ఎం.ఏ.హమీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ పురస్కారాలను నాటక రచయిత మొహమ్మద్ ఖాజావలి, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, సత్కళాభారతి అధ్యక్షుడు జి. సత్యనారాయణ, తెలుగు వర్సిటీ నృత్యగురువు నిర్మల ప్రభాకర్, సంగీత విద్వాంసులు వల్లి, ప్రముఖ పాత్రికేయులు అయోధ్యరెడ్డి, ప్రముఖ గాయని రాధారాణి, నృత్యకారిణి శివాణిరెడ్డి, సంజన రెడ్డి లను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని లలితరావు నేతృత్వంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అందరిని అలరించింది. గాయనీగాయకులు వినోద్ బాబు, లలితరావు, డాక్టర్ టి.వి.రావు, డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు అద్భుతంగా గానం చేసారు.

## కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం ప్రారంభిస్తాం

**చిక్కడపల్లి, ఆగష్టు 7, ప్రభాతవార్త:** జవహర్ నగర్ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం పనులు అతి త్వరలో ప్రారంభిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సుమారు రూ: 26 లక్షల నిధులను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సహకారం తో జిహెచ్‌ఎంసి నిధులు మంజూరు చేసిందని, అయినా అధికారులు పనులు ప్రారంభించక పోవడం పై కార్పొరేటర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ అధికారుల తీరుపై మండిపడ్డారు. సమావేశానికి హాజరైన డిప్యూటీ కమిషనర్ రామానుజులరెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్ మాట్లాడుతూ మరో 15 రోజుల్లో కమ్యూనిటీ హాల్ రినోవేషన్ పనులు ప్రారంభిస్తామని, అందుకు అన్ని చర్యలు పూర్తి అయ్యినట్లు అధికారులు కార్పొరేటర్‌కి వివరించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, ఎస్పార్టీ జవహర్ నగర్ వ్యాయామశాల, ఆటస్థలము, కళ్యాణ మండప పరిరక్షణ కమిటీ అధ్యక్షులు నర్మెట్ట మల్లేష్, కమిటీ సభ్యులు గుండు సురేందర్, మహేందర్, ఎం. కృష్ణ, జగదీష్, దినేష్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## జామైతుల్ మోమినాథ్ ఆధ్వర్యంలో సదస్సులు

**చార్మినార్, ఆగష్టు 7 ప్రభాతవార్త :** పాతబస్తీలో రెండు రోజుల పాటు జామైతుల్ మోమినాథ్ ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహించ నున్నామని అమేర్ సరియత్ ముఫ్తీ హాసనుద్దీన్ తెలిపారు. మొగల్‌పురలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఆగష్టు నెల 9వ తేదీ శనివారం తలాబ్‌కట్టలోని షాజహాన్ ఫంక్షన్ హాల్‌లో, 10న కిల్వత్‌లోని ఉర్దూ మస్కాన్‌లో సదస్సులు జరగనున్నాయని తెలిపారు.



శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీవిజయగణపతి ఆలయం చౌరస్తాలో భారీగా నిల్చిపోయిన వరద నీరు

# సిసి రోడ్డును మింగేసిన వరద

**రెండు అడుగుల మేర పేరుకుపోయిన వర్షం నీరు - రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**బేగంపేట ఆగష్టు 7, ప్రభాతవార్త :** వానొచ్చిందంటే చాలు బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీవిజయ గణపతి ఆలయం చౌరస్తాలో రెండు అడుగుల మేర వర్షం నీరు నిల్చిపోతుంది. ఈ ప్రాంతమంతా చెరువును తలపిస్తోంది. వర్షం నీటి ఉధృతికి ఈ ప్రాంతంలో ఉన్న సీసీ రోడ్డు కూడా ధ్వంసం అయిందంటే వరద నీటి ఉధృతి ఎంతగా ఉందో అర్ధం చేసుకోవచ్చు. ఇటీవల హైడ్రా, వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులు కొచ్చుర్ అపార్ట్‌మెంట్ సమీపంలోని నాలాను శుభ్రం చేసేందుకు ప్రయత్నించిన సమయంలో ఈ ప్రాంతంలో వరద నీటి ఉధృతి అధికంగా వస్తుంది. గతంలో కొంత మేర నిల్చిఉండే వర్షం నీరు ఈ మధ్య కురిసిన వర్షాలకు భారీగా నిల్చిపోతోంది. గురువారం ఉదయం ఈ ప్రాంతంలోని నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మరో మారు అధికారులు సిబ్బందితో తొలగింపజేసారు. అయితే సాయంత్రం సమయానికి భారీ వర్షం కురియడంతో మళ్లీ ఈ ప్రాంతంలో నీరు భారీగా నిల్చింది. దీంతో ఈ ప్రాంతానికి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పాఠశాలలనుంచి ఇంటికి చేరుకునే చిన్నారులు సైతం ఆ నీటిలోగుండానే ఇండ్లకు చేరుకున్నారు. భారీ వర్షం మరో 48గంటలు కురిసిందంటే ఈ మార్గంలో మరింత నీరు నిల్చి ఉండి రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ లోని శ్రీ విజయ గణపతి ఆలయం వద్ద నీరునిల్చి ఉండకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు, విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

**నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి**



నాలాలో పేరుకు పోయిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

వర్షం కురిసిన సమయంలో వరద నీరు రోడ్లపై నిలవకుండా సాఫీగా సాగేలా ఎప్పటి కప్పుడు అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కల్సి గురువారం శ్యాంలాల్ బిల్డింగ్‌లో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైనేజీ లైన్ల ను పరిశీలించారు. శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీవిజయగణపతి ఆలయం వద్ద వరద ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొచ్చుర్ అపార్ట్‌మెంట్ సమీపంలోని నాలా తూముల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. వెల్కిన్ పార్కు అపార్ట్‌మెంట్ వద్ద కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూచించారు. వరద నీరు నిలవకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేటర్ వెంట అధికారులు ఆశీష్, రామేశ్వరరావు, జీహెచ్‌ఎంసీ వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులున్నారు.

**పారిశుధ్య కార్మికులకు సత్కారం**

ఇటీవల కురిసిన భారీ వర్షానికి బేగంపేట డివిజన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లో భారీ ఎత్తున వర్షం నీరు నిల్చిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు హాజీటోచర్ హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ శాఖాధికారుల దృష్టికి తీసుకు పోవడంతో గురువారం వారు సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపించి నాలాలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. అయితే ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజీటోచర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఎన్.నటరాజ్, టిఎం యాదగిరి, నర్సింహయాదవ్, సున్నంరాజు, పేపర్ శేఖర్ తదితరులున్నారు.

# తెలంగాణకి గొప్ప చరిత్ర ఉంది

**ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ మహమూద్**

**చిక్కడపల్లి, ఆగష్టు 7 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని, ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఎస్.కె. మహమూద్ అన్నారు. గురువారం విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల ఎనిమిదవ తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు కళాశాల ప్రధానాచార్యులు డా. కె.ప్రభు అధ్యక్షత వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య డి.ఎస్ఆర్.రాజేంద్ర సింగ్, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకులు ఆచార్య జి. వెంకటరాజం, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య జి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఆచార్య ఎస్.కె. మహమూద్ మాట్లాడుతూ కుతుబ్షాహీల నుండి ఇప్పటివరకు గల తెలంగాణ చరిత్రను వివరించారు. అలాగే తెలంగాణ సాయుధ పోరాటం యొక్క ఆవశ్యకతను వివరించారు. డా. రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ ఇంత పెద్ద కార్యక్రమం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఈ సమావేశాలకు కాలేజీయేట్ ఎడ్యుకేషన్ నుండి తగిన ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. ఆచార్య వెంకటరాజ్యం మాట్లాడుతూ తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఆవిర్భానికి గల కారణాలను వివరించి, వీటిని నిర్వహించడంలో గల ఇబ్బందులను వివరించారు. ఎన్ని అవరోధాలు వచ్చినా వీటిని నిర్విఘ్నంగా కొనసాగిస్తామని తెలియజేశారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశాల యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను, పాఠ్యప్రణాళికలలో చరిత్ర యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ అంశాలపై ఆచార్యుల చేత పత్ర సమర్పణలు జరిగాయి. కళాశాల ప్రధానాచార్యులు డా. కె.ప్రభు కన్వీనర్ వెంకట్ ఈశ్వర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్. లావణ్య, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఆఫీస్ బేరర్స్ సుధారాణి, ఆచార్య లాపా పాల్గొన్నారు.




తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
నిట్ నెం: 04/EE/DIV-16/SBZ/GHMC/2025 తేది: 05.05.2025
క్ర.సం.1. పనిపేరు : GHMC, SBZ అంబర్‌పేట సర్కిల్-16లో గోల్నాకా వార్డ్-82లో కవేళాలో లిఫ్ట్ మరియు కోల్డ్ స్టోరేజీకు మరమ్మతులు మరియు సర్వీస్ పనుల కొరకు నాన్-సార్ ఐటమ్‌ల ఆహ్వానించే కొటేషన్‌లు. క్రింద పేర్కొన్న ఐటమ్‌లకు తయారీదారులు, అథారిటీలు మరియు డీలర్లు, ఏజెన్సీలు మొ॥ వారి నుండి కొటేషన్‌లు కోరబడుతున్నవి. పని కొరకు NON SOR ఐటమ్‌ల కొటేషన్‌ల కొరకు ఆహ్వానం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ, సమయం బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 07.08.2025 మ.3.00గం., 14.08.2025 మ.3.00గం. ఆఫీస్ పేరు, చిరునామా, సెల్ నం: సీల్డ్ కొటేషన్‌లు EE కార్యాలయంలో డివిజన్-16, GHMC, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, ఆబిడ్స్, హైదరాబాద్ వద్ద 14.08.2025 తేదీన లేదా ముందు మ.3.00గం. దాఖలు చేయవచ్చును. సెల్: 9963550657/6309919062. తదుపరి వివరాలు పై ఐటమ్‌లకు పూర్తి స్పెసిఫికేషన్ GHMC వెబ్ సైట్: https://ghmc.gov.in నుండి పొందవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తరపున, డివిజన్-16, SBZ, GHMC.
DIPR.NO. 6169-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 07.08.2025

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, R.R. DISTRICT, UPPAL AT L.B. NAGAR
O.S. NO. 500 OF 2025
BETWEEN:
Smt. Gulabi Singh & Others ... Plaintiffs
AND
The Tahsildar, Uppal Mandal & Another ... Defendants
NOTICE
To
All Concerned
(BY ORDER OF THE COURT)

PUBLIC NOTICE

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI AT KUSHAIGUDA
Between:
... AND OTHERS ... PLAINTIFFS
AND
THE TAHSILDAR, MALKAJGIRI MANDAL AND
ALL CONCERNED ... DEFENDANTS

## నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలి

- కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న లచ్చిరెడ్డి

**వనస్థలిపురం ఆగస్టు7, ప్రభాతవార్త :**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సలహాదారుడైన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ ఉద్దీన్ ఆధ్వర్యంలో పాఠశాలలో 250 మెడిసినల్ చెట్ల మొక్కలను బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి , డిప్యూటీ ఎఫ్ఆర్ఓ కసనా నాయక్‌లు హాజరై చెట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పరిసరాలను కాపాడుకోవాలంటే చెట్లను పెంచుకోవాలని ఈ యొక్క మెడిసినల్ మొక్కల వల్ల పర్యావరణం మరియు పాఠశాల యొక్క గాలి కూడా స్వచ్ఛంగా తయారవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వి దినేష్ మరియు పార్టీ నాయకులు శంకరయ్య గౌడ్, బిజెవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు ఉపాధ్యాయ బృందం , పాఠశాల యొక్క నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత, వికలాంగుల సాధికారత కోసం ట్రస్ట్ ఏర్పాటు అభినదనీయం : ఎమ్మెల్యే



ట్రస్ట్ సభ్యులతో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి

**హయత్ నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త :** వెనుకబడిన వర్గాల యువత, వికలాంగుల సాధికారిత, ఆర్థిక చేయుత నిచ్చేందుకు ఉపాధి ఆధారిత శిక్షణ కేంద్రం ఎర్పాటు చేయడం మంచి శుభ పరిణామమని ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ట్రెయిన్ ట్రస్ట్ శిక్షణా కేంద్రన్నీ ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ... 45 రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. శిక్షణా కాలంలో వారికి ఉచిత భోజనం, విడిది కూడా ఇవ్వడం అభినంద నీయమన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యా, ఉద్యోగ మార్గాలను సాదించాలని సూచించారు. ట్రస్ట్ సభ్యులకు సంపూర్ణ మద్దతు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ అమిషా ప్రభు, సురేష్, పవన్, సత్యం చారి, ప్రతిక్ పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి




కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నవజీవన్ రెడ్డి.

**హయత్ నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
డివిజన్ పరిధిలోని వివిధ కాలానీలలో సీసీ రోడ్ల నిర్మానానికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... హయత్ నగర్ డివిజన్ నగర శివారు లో ఉండడం వల్ల కాలక్రమమైన నిత్యం అనేకమైన నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న కాలనీలలో ప్రజలకు కనీస మోనిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యల పరిష్కారానికి డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.

## సత్యనారాయణ స్వామి దేవాలయంలో సంప్రోక్షణ పవిత్రోత్సవం



పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ లింగారెడ్డి దంపతులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
గడ్డిఅన్నవరక్షేత్రంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామివారి దేవాలయంలో గురువారం సంప్రోక్షణ పవిత్రోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ లింగారెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాదికారి వక్కలంక శ్రీనివాస్‌రావు, దాతలు వసంత్ మనోహర్, ఉమాదేవి, మహేందర్‌రెడ్డి, పాల్గి శ్రీనివాస్, బి.సంతోష్, రమేష్ భక్తులు పాల్గొన్నారు.

## మార్కెట్ కార్మికులకు వసతులు కల్పించాలి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలో పనిచేసే కార్మికులకు అవసరమైన వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా సిఐటియు కార్యదర్శి ఎం.చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా హమాలి అధ్యక్షులు మల్లెపాక వీరయ్య ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మార్కెట్లలో హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులకు లైసెన్సులు, డ్రెస్సులు, ప్రమాదబీమా, ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు ఎం.గోపినాయక్, జి.మనోహర్, కే.రాములు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కూలిన నాలా స్లాబ్ ...తప్పిన పెను ప్రమాదం

-గృహప్రవేశం చేసిన మూడు నెలలకే కూలిన ర్యాంప్
-15 రోజులుగా ఇంట్లోకి వెళ్లలేని పరిస్థితి
-అధికారులను ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం



ఇంటి ముందు దుస్థితి (కూలిన నాలా దృశ్యం)

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
కూలిన నాలాతో నివాసస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 15 రోజులుగా ఇంట్లోకి వెళ్లలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ర్యాంపు కూలినప్పటి నుంచి దుర్వాసన. ఈ సమస్య పరిష్కరించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సమాచారం ఇస్తే దురుసుగా వ్యవహరిస్తున్నారని ఇంటి యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొత్తపేట డివిజన్ బృందావనకాలనీ రోడ్‌నెంబర్ 1లో నివాసం ఉంటున్న ఎన్. తులసీరామ్ నివాసం ముందు ఉన్న నాలా స్లాబ్ భారీగా కురిసిన వర్షాలతో పూర్తిగా కూలిపోయింది. అదృష్టవశాత్తు ఇంటివద్ద ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్లాబ్‌కూలిన సమయంలో ఎవరైనా అక్కడ ఉంటే నాలాలో కొట్టుకుపోయే ప్రమాదం ఉండేది. నాలాపై ఉన్న ర్యాంపు పూర్తిగా కూలిపోవడంతో తులసీరామ్ కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లలేని దుర్భర పరిస్థితిలో నెలకొన్నాయి. ర్యాంపు పూర్తిగా కూలిపోవడంతో మురుగునీటి దుర్వాసన వేస్తోంది. గత 15 రోజులుగా నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు బయటనే ఉంటున్నారు. గృహప్రవేశం చేసిన మూడు నెలలకే ఈ సంఘటన జరిగింది. నాలాపై ర్యాంపు కూలిపోయిన విషయం స్థానిక కార్పొరేటర్, అధికారులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి కొద్ది రోజులకు పనులు ప్రారంభించారు. అయితే నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అసంపూర్తిగా పనులు చేపడుతున్నడంతో భవిష్యత్తులో మళ్లీ నాలాపై ర్యాంపు కూలిపోయే ప్రమాదం ఉందని ఇంటి యజమాని ఆందోళన చెందుతున్నాడు. నాలాపై నిర్మించిన స్లాబ్‌కు స్టీల్(ఇనుప సువ్వలు) వాడకపోవడం వల్ల అది పూర్తిగా కూలిపోయింది. ఇంజనీరింగ్ విభాగం అధికారులు అసంపూర్తిగా నిర్మాణం పనులు చేపడుతుండడంతో పనులు పూర్తయిన అనంతరం ఇంట్లోకి వెళ్లడానికి కూడా భయంగా ఉందని యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పనులు పటిష్టంగా చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వెంకటేశ్వర్లుకు చెబితే ఎలా నిర్మించాలో మాకు తెలుసని నీసలహాలు అవసరం లేదంటూ దురుసుగా మాట్లాడుతున్నాడని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్లాబ్‌కూలి పెను ప్రమాదం తప్పితే ఆ స్థానంలో పటిష్ట నిర్మాణం జరపాల్సిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు మొక్కుబడిగా పనులు చేపట్టి చేతులు దులుపుకునే విధంగా వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తోంది. స్లాబ్ ఏర్పాటుకు అవసరమైన గోడ నిర్మాణం విస్తీర్ణం తగ్గించడం వల్ల మళ్లీ కూలిపోయే ప్రమాదం ఉందని నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పటిష్టంగా నిర్మించే విధంగా ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జిహెచ్ఎంసి అధికారులు స్పందించి అసంపూర్తిగా జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి భవిష్యత్తులో ఇబ్బంది జరగకుండా పటిష్టంగా నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వడ్డెర కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరగాలి : శ్రీశైలం



**తుర్కయంజాల్ ఆగస్టు 7,ప్రభాతవార్త:**
తెలంగాణ వడ్డెర సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం, మరియు రాష్ట్ర కార్మిక శాఖ ఉపాధ్యక్షుడు బోదాస్ నరసింహ హాజరై మాట్లాడుతూ... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్షాకాల బడ్జెట్ సమావేశం లో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం, అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి నేటికీ 77 ఏళ్లు గడిచిన వడ్డెర సంఘం కులస్తులకు బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల హామీలలో భాగంగా వివిధ సభలో మరియు సమావేశంలో గౌరవ రాహుల్ గాంధీ మరియు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడిగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్టుల్లోనూ 30 శాతం పనులు ఇచ్చి కేటాయించి, రూ.5 కోట్ల వరకు ఎలాంటి ఈఎండీ లేకుండా పనులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పని చేస్తున్న సమయంలో అనేక మంది ప్రమాదా లకు గురై కాళ్లు, చేతులు కోల్పోయి వికలాంగులుగా మారుతున్నారని, కొంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఈ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. చనిపోయిన వడ్డెర కులాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెర కులాలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వడ్డెర కులాలకు ఉపాధి లేక విలవిల్లాడుతున్నారు . వడ్డెర కుల వృత్తి ఉపాధి కొరకై ఆధునిక పనిముట్లును 90 శాంతం సబ్సిడీతో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ, గండికోట రాజు, గండికోట శ్రీనివాస్, పందిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గుండె, గ్యాస్ నొప్పిపై అవగాహన చాలా అవసరం : కామినేని వైద్యులు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్

**మన్సూరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త:**
వయసుతో సంబంధం లేకుండా ఈ మధ్య తమకు వచ్చింది గ్యాస్ట్రిక్ సమస్య నా లేదా గుండె నొప్పా అనేది తెలియకుండా ఇబ్బంది పడుతున్నారని దాదాపు రెండింటి లక్షణాలు ఒకేలా ఉంటాయని కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని కామినేని ఆసుపత్రి కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ దేశముఖ్ సూచించారు. ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది గుండె నొప్పి వచ్చిన గ్యాస్ సంభంధిత సమస్య అనుకొని నిర్లక్ష్యం చేస్తున్నారని దీంతో ఆఖరి నిమిషంలో గుండె సంబంధిత సమస్య తలెత్తిందని హాస్పిటల్ కు రావడం జరుగుతుందని అన్నారు. గ్యాస్ సమస్య అనుకొని కొన్ని రకాల మందులు వాడడం లో వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలని అదే విధంగా ముందుగా ఈసీజీ చేయించుకోవాలని సూచించారు. జీవన శైలి కారణాల వలన ఇటీవల గుండె జబ్బులు ఎక్కువగా వస్తున్నాయని ఎద భాగం లో అసౌకర్యంగా , వికారం, తల తిరగడం అజీర్తి వంటివి వస్తే గ్యాస్ సమస్య అనుకొని పొరబడుతున్నారని ఈ విషయంలో అవగాహన ఉండాలని ఆయన సూచించారు. గ్యాస్ సమస్య ను వచ్చి నెల తర్వాత కూడా తగ్గక పోతే వెంటనే గుండె సంబంధిత వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ మధ్య సడెన్ కార్డియాక్ అరెస్ట్‌లు అవుతున్నాయని కావున సామాన్య ప్రజల నుండి మొదలు అందరు సీపీఆర్ చేయడం నేర్చుకోవాలని కోరారు. గుండె సంబంధిత సమస్యలు పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, లేకుంటే అది మనిషి ప్రాణాలకే ముప్పు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు రవికాంత్, సురేష్ కుమార్, రిషిత్ కుమార్ పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం

-లార్డ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి




లార్డ్స్ విద్యావిధానాలను వివరిస్తున్న వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి



ఓరియంటేషన్‌కు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా లార్డ్స్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతున్నదని లార్డ్స్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్ బ్రాంచి లార్డ్స్ పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప సూచనలతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సందర్భంగా లార్డ్స్ విధి విధానాలు, విద్యార్థులను తీర్చిదిద్దడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదువుకునే విధంగా వారిని తయారు చేస్తున్నామనీ ఇది లార్డ్స్ విద్యా సంస్థల ప్రత్యేకత అని వివరించారు. అనుభవజ్ఞులై ఉండి చిత్తశుద్ధితో పని చేసే ఉపాధ్యాయ బృందంతో విద్యా బోధన చేయిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు మంచి బాటలు వేయడం జరుగుతున్నదని ఆయన వెల్లడించారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండే విధంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, మల్లాపూర్ బ్రాంచి ప్రిన్సిపాల్ కొండల్‌రావు, ఇంఛార్జి శేఖర్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్రమంత్రి అనిల్ శాను సత్కరించిన ఉప్పల



అనిల్ శా' ని సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శా తనయుడు ఏఐసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి అనిల్ శా ని టీపీసీసీ సభ్యుడు మాజీ పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఢిల్లీలో ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛని అందజేసి, కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి బాటలో నడుస్తూ అనిల్ శా' కూడా దేశానికి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

## బొగ్గు గనుల కార్మికుల హక్కుల కోసం బిఎంఎస్ నిరంతరం పోరాటం

- కొత్తకాపు లక్ష్మారెడ్డి
- ప్రొవిడెండ్ ఫండ్ దుర్వినియోగంపై సిబిఐ ఎంక్వైరీ చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ బోర్డ్ బిఎంఎస్ ఇంఛార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి, తదితరులు

**మేడిపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త :**
కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గనుల కార్మిక హక్కుల కోసం భారత మజ్దూర్ సంఘ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బిఎంఎస్ బొగ్గు గనుల ఇంచార్జ్. ప్రావిడెంట్ ఫండ్ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. గురువారం పీర్జాదిగూడలో బొగ్గు గనుల పెన్షనర్స్ ద్వితీయ వార్షిక మహాసభలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... సింగరేణిలో పదవి విరమణ పొందిన కార్మికుల కనీస పెన్షన్ రూ.5000 వేలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా ఫించన్ అందించాలని మరో వైపు కార్మికుల ఆరోగ్యం కోసం హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్ ప్రాంతాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, మెడికల్ అవుట్లెట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏంతైన ఉందన్నారు. ఉద్యోగ సమయంలో కార్మికులు చెల్లించిన ప్రొవిడెండ్ ఫండ్ నిధిలో అవకతవకలు జరిగాయిని దీనికి ప్రొవిడెండ్ ఫండ్ బోర్డు సభ్యులు కారణమని స్పష్టం చేశారు. ఈ విషయంపై బిఎంఎస్ లోతుగా అధ్యాయనం చేసిందని బిఎంఎస్ కృషి వల్లనే పెన్షనర్లకు ప్రస్తుతం సరైన న్యాయం జరిగుతోందన్నారు. కార్మికుల డబ్బును దుర్వినియోగానికి పాల్పడ్డ సంస్థ బాధ్యులపై సిబిఐ ఎంక్వైరీ నిర్వహించి పోత్తును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కోల్ ఇండియా. సింగరేణిలలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమదోపిడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పదవి విరమణ పొందిన రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో రిక్రుట్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తిలో కాంట్రాక్ట్, రెగ్యూలర్ ఉద్యోగుల మధ్య 5050 ఉత్పత్తి ఉండే లా చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల ఉద్యోగ భద్రత నేపథ్యంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు స్వస్తి పలికి భుగర్భ మైనింగ్ చేయాలన్నారు. భూగర్భ మైనింగ్తో ఏలాంటి వాతవరణం కాలుష్యం ఉండదన్నారు. ప్రొవిడెండ్ ఫండ్ బోర్డులో ఉన్న అవినీతి తిమింగలాలా కుంభకోణంపై బిఎంఎస్ పోరాటం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పెన్షనర్ల పలు సమస్యలపై పలు తీర్మనాలు చేసి సభ్యులు ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియాలోని పదవి విరమణ పొందిన కార్మికులు పాల్గోనగా బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, పెన్షన్ వెల్ఫర్ ప్రతినిధి మండ రమాకాంత్, ఆల్ ఇండియా ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి, రవీందర్రావు, టి.ఉమాకర్. కొమరయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ శ్రీవారి హుండీ ఆదాయం 1,45,233



జిల్లెలగూడలోని మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయం

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ గ్రామంలోనున్న చారిత్రక మత్స్యావతార శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన సుమారు రెండున్నర మాసాల హుండీ ఆదాయం రూ.1,45,233 వచ్చింది. గురువారం ఆలయ ఇఓ వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఛైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్, ఎండోమెంట్ నుండి పరిశీలకునిగా వచ్చిన వచ్చిన ఇఓ మురళీకృష్ణ, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, పోరెడ్డి జంగారెడ్డి, పలువురు భక్తుల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. అయితే గడచిన 78 రోజులకు సంబంధించిన హుండీ మొత్తాన్ని ఆలయ పూజారులు, శ్రీవారి సేవకులు లెక్కించగా మొత్తం రూ.1,45,233 వచ్చింది. ఈ మొత్తాన్ని ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి దేవాలయానికి సంబంధించిన ఖాతాల్లో జమ చేయించారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో సివరేజి పైపులైన్ల ఆధునికీకరణ పనులకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ సైదాబాద్ బస్తీలోని మూడుగుళ్ల వద్ద నుండి దోభిఘాట్ మెయిన్ రోడ్డు వరకు రూ.50.77లక్షలతో, శంకేశ్వర్ బజార్‌లోని బిజెపి క్వార్టర్స్‌లో రూ.16లక్షలతో, తిరుమల హిల్స్ నుండి కళ్యాణ్‌నగర్ వరకు రూ.7లక్షలతో సివరేజ్ పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. నూతన సివరేజి లైన్లతో ఆయా కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కరమవుతుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వాటర్‌వర్క్స్ డిజిఎం హస్మత్ అలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో మాన్సూన్ స్పెషల్ డ్రైవ్



జిహెచ్ఎంసి సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను కార్పొరేట ర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాన్సూన్‌లో ప్రత్యేకంగా శానిటేషన్, ఎంటమాలజి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెత్తను తొలగించాలని, సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తీయాలని, మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసి మంగతాయారు. శానిటేషన్ డిఇ వెంకట్ రాజు, ఫక్రుద్దీన్, అర్జున్, ఇంజనీరింగ్ ఎఇ శిరీష, ఎంటమాలజి ఎం భారతి, యుసిడి యాదయ్య, హైడ్రా విభాగం వెంకటేష్, స్థానికులు సర్వేశ్వర్‌రావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ ప్రారంభం

**అత్తాపూర్ ఆగస్టు7,ప్రభాతవార్త :**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం బిసి సెల్ ను రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. రాజేంద్రనగర్ లోని పరిపాలన భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిసి సెల్ కార్యాలయాన్ని మంత్రి లాంచనంగా ప్రారంభిస్తారు. ఇటీవల జరిగిన విశ్వవిద్యాలయ పాలక మండలి సమావేశంలో ఎస్సీ,ఎస్టీ సెల్ తరహాలో యుజిసి మార్గదర్శకాలను అనుసరించి బిసి సెల్ ను ఏర్పాటు చేయడానికి పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించిందని ఉపకులపతి వివరించారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర బిసి ఉద్యోగులు, విశ్వవిద్యాలయంలో చదువుతోన్న బిసి విద్యార్థుల సంక్షేమం కోసం ఈ సెల్ పనిచేయనుందని చెప్పారు. విద్యా, ఉద్యోగాలలో తీదిల వాటాను సక్రమంగా పాటించేలా చూడటం, వాటా ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం, ప్రవేశాలలో కచ్చితంగా తీది రిజర్వేషన్ల అమలయ్యేలా ఈ విభాగం పర్యవేక్షించనుందన్నారు. నూతనంగా ఏర్పాటైన బిసి సెల్ కు ప్రొఫెసర్ స్థాయి అధికారి సిహెచ్. దామోదర రాజుని ఆఫీసర్ ఇన్ ఇన్చార్జి గా నియమిస్తూ విశ్వవిద్యాలయం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని కాకతీయ, ఉస్మానియా విశ్వ విద్యాలయాల్లో ఇదివరకే బిసి సెల్ ఏర్పాటు చేశారని అదే తరహాలో జయశంకర్ విశ్వవిద్యాలయం లో ఏర్పా టు చేయడం జరిగిందని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరించారు. శుక్రవారం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజేంద్ర నగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులతోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం అవుతారని తెలిపారు. విశ్వవిద్యాలయంలో చేపట్టే ప్రవేశాలు, నియామకాలు, పదోన్నతులలో సామాజిక న్యాయంను పాటించేందుకు ఈ సెల్ దోహదం చేస్తుందన్నారు.